సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 26 । డిసెంబర్ । 2024



రక్షకుడి రాక.. వెలుగు రేఖ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


8లో



వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షితం

వేటకు వెళ్లి వాతావరణ ప్రతికూలతల వల్ల సముద్ర జలాల్లో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కోస్ట్‌గార్డు సిబ్బంది రక్షించారు.

9,745 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో తత్కాల్ అడ్మిషన్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (అమరావతి) నిర్వహిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు తత్కాల్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు బుధవారం తెలిపారు. సాధారణ అడ్మిషన్ ఫీజునకు అదనంగా తత్కాల్ ప్రవేశ రుసుం రూ.600 చెల్లించాలన్నారు. ప్రవేశం కోరే అభ్యాసకులు తత్కాల్ గడువును ఉపయోగించుకుని వెంటనే ప్రవేశాలు పొందవచ్చన్నారు. వివరాలకు రాజమహేంద్రవరం కోటగుమ్మం వద్ద ఉన్న విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

వాజ్‌పేయి ఆదర్శప్రాయుడు



మామిడికుదురులో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకుల నివాళి

మామిడికుదురు: మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి అందరికీ ఆదర్శప్రాయుడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి వేమాతో పాటు ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి పాలనలో దేశం సాధించిన అభివృద్ధిని వివరించారు. మగటపల్లిలో వాజ్‌పేయి సేవా సమితి అధ్యక్షుడు నక్కా త్రిలోచనరావు ఆధ్వర్యంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు చేతుల మీదుగా సంచార జాతులకు, విద్యార్థులకు పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఇదేం తిరకేసు?

- కానులు మీకు.. కేసులు మాకా?
- ఇసుక మాఫియా సభ్యులపై బోట్స్‌మెన్ సొసైటీ సభ్యుల తిరుగుబాటు
- కోటిలింగాల ర్యాంప్‌లో 20 బోట్స్‌మెన్ సొసైటీ బోట్లపై కేసులు
- కేసులు పెట్టకుండా తాము చూసుకుంటామని ఇసుక మాఫియా సభ్యుల భరోసా
- తీరా కేసులు నమోదు చేశాక చేతులెత్తేస్తున్న వైనం
- కోటిలింగాల రేవులో 14 ఇసుక ర్యాంప్‌ల నిర్వహణ
- నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళ డ్రెడ్జింగ్
- రూ.కోట్ల విలువైన ఇసుక దోపిడీ
- కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో దందా



కోటిలింగాల రేవులో ఇటీవల అధికారులు సీజ్ చేసిన బోట్స్‌మెన్ సొసైటీలకు చెందిన బోట్లు(ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: ఇసుక మాఫియాపై తిరుగుబాటు మొదలైందా? మాఫియా వ్యవహరిస్తున్న తీరు బోట్స్‌మెన్ సొసైటీలకు మింగుడు పడటం లేదా? అనధికారిక డ్రెడ్జింగ్ చేసి రూ.లక్షలు గడిస్తున్న ముఠా సభ్యులు.. కేసులు వచ్చే సరికి తమకే సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇటీవల కోటిలింగాల ర్యాంపులో చోటు చేసుకున్న పరిణామాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

కొల్లగొట్టేస్తున్నారు

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో కోటిలింగాల ర్యాంపును 14 విభాగాలుగా విభజించారు. కోటిలింగాల-1 ర్యాంప్ బోట్స్‌మెన్ సొసైటీలకు మాత్రమే కేటాయించాలన్న డిమాండ్‌తో కోర్టులో వ్యవహారం నడుస్తోంది. కోటిలింగాల-2 నుంచి గామన్ వంతెన వరకు 14 ర్యాంపులు నడుస్తున్నాయి. ర్యాంపుల నిర్వహణకు బోట్స్‌మెన్ సొసైటీలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సంప్రదాయ పడవలతో ఇసుక తీత నిర్వహించేలా ఉత్తర్వులు వెలువరించింది. అయితే ఇక్కడ మాత్రం వ్యవహారం అందుకు విరుద్ధంగా సాగుతోంది. సొసైటీల ముసుగులో కూటమి నేతలు రంగంలోకి దిగారు. ఒక్కో ర్యాంపును ఒక్కో కూటమి నేత పంచుకున్నారు. అక్కడ తమ అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కారు. డ్రెడ్జింగ్ బోట్లతో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలకు నాంది పలికారు. రాత్రిళ్లు తవ్వకాలు నిషేధమైనా అదేమీ పట్టనట్లు రాత్రంతా తవ్వకాలు చేపడుతూ రూ.లక్షలు దండుకుంటున్నారు. కోటిలింగాల-2 నుంచి 4వ బ్రిడ్జి వరకు ఉన్న 14 ర్యాంపుల్లో రోజుకు 500లకు పైగా లారీల ఇసుక జిల్లా దాటుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో లారీ రూ.25,000కు విక్రయిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే రోజుకు రూ.1.25 కోట్లు విలువ చేసే ఇసుకను కూటమి నేతల ముఠా కొల్లగొట్టేస్తున్నట్లు లెక్క. లారీల్లో ఇసుక బహిరంగంగా తరలుతున్నా మైనింగ్, జిల్లా అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూడటమే తప్ప అడ్డుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వ అనుమతులు లేకుండా యంత్రాలతో తవ్వుతున్నా..



కోటిలింగాల-2లో డ్రెడ్జింగ్ బోట్ (ఫైల్)

కేసులంటే హ్యాండ్సప్..!

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అత్యధిక అక్రమాలు జరుగుతున్న ర్యాంప్‌గా కోటిలింగాల ఖ్యాతి గడించింది. ఇందులో రేవు-2లో అక్రమ తంతు ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా.. కోటిలింగాల-2 రేవు నిర్వహిస్తున్న ఇసుకాసురుల్లో మార్పు రాకపోవడంతో మిగిలిన రేవుల వాళ్లు ఆందోళన చెందుతున్నారు. రేవు-2 పాపంలో తాముకూడా ఇరుక్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఇటీవల కోటిలింగాల రేవులో డ్రెడ్జింగ్ యథేచ్ఛగా జరుగుతోందన్న సమాచారంతో కొన్ని రోజుల క్రితం అధికారులు ర్యాంపులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డ్రెడ్జింగ్ బోట్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు వెళ్లకుండా బోట్స్‌మెన్ సొసైటీకి చెందిన సాధారణ బోట్లను పట్టుకున్నారు. కేటాయించిన ప్రాంతంలో కాకుండా వంతెనకు సమీపంలో తవ్వుతున్నారన్న నెపంతో సుమారు 18 బోట్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ పరిణామం బోట్స్‌మెన్ సొసైటీల్లో తీవ్ర ఆగ్రహావేశాలు నింపింది. డ్రెడ్జింగ్ బోట్లపై కాకుండా కష్టపడి ఇసుక వెలికితీసే తమపై చర్యలకు దిగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాగైతే తాము ఇసుక ఎలా తీయాలంటూ ఆవేదన చెందుతున్నారు.

మాఫియా చేష్టలతో చెడ్డ పేరు!

బోట్స్‌మెన్ సొసైటీల పేరుతో ఇసుక మాఫియా చేస్తున్న అక్రమాలతో తమకు చెడ్డ పేరు వస్తోందని బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు ఆవేదన చెందుతున్నట్లు తెలిసింది. తమ పేరు చెప్పుకుని ఇసుక అక్రమంగా తరలించి రూ.కోట్లు గడిస్తున్న కాంట్రాక్టర్లు తమకు మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధరలు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయమై ఇటీవల సమావేశమై భవిష్యత్తులో ఏం చేద్దామని చర్చించినట్లు సమాచారం.

ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. కాదూ కూడదని అధికారులు దాడులు చేస్తే కూటమి ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. చేసేది లేక అధికారులు సైతం మిన్నకుండిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారం అండతో కూటమి నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు. ర్యాంపులను గుల్ల చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు.

అండగా ఉంటామని తప్పుకుంటారా?

కోటిలింగాల రేవులో 18 బోట్లను అధికారులు పట్టుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన కోటిలింగాల రేవులోని ఓ ఇసుకాసురుడు మీరేమీ అధైర్య పడాల్సిన అవసరం లేదని, కేసులు నమోదు చేయకుండా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. తనకు ప్రభుత్వ పెద్దల అండ ఉందని నమ్మబలికాడు. ఇంకేముందిలే తాము కేసుల నుంచి గట్టెక్కినట్లేనని బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు భావించారు . చివరికి అధికారులు కేసులు నమోదు చేయడంతో అవాక్కయ్యారు. ఇదేమని సదరు ఇసుకారుడిని ప్రశ్నిస్తే తానేమీ చేయలేనంటూ తప్పుకున్నట్లు తెలిసింది.

అతనే పట్టించాడా?

కోటిలింగాల రేవులో ఇసుక డ్రెడ్జింగ్ నిరాటంకంగా జరుగుతోందన్న విషయం పత్రికల ద్వారా బహిర్గతమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ సైతం తీవ్రంగా పరిగణించారు. ఇలాగే కొనసాగితే ఇసుక ర్యాంప్ తన నుంచి ఎక్కడ చేజారుతుందోనన్న భయంతో కోలిలింగాల-2 ర్యాంపులోని ఓ ఇసుక మాఫియా బాధ్యుడు అధికారుల అండతో బోట్స్‌మెన్ సొసైటీ బోట్లను పట్టుకునేలా కథ నడిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తద్వారా తనపై వస్తున్న ఆరోపణలను పక్కదోవ పట్టించేందుకు ఇదంతా చేసినట్లు విమర్శలున్నాయి.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సెలవు దినం కావడంతో వేలాదిగా భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలిరావడంతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది. భక్తులంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో సప్త గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణునికి పూజలు చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 40 లక్షల ఆదాయం సమకూరింది.

ప్రపంచ దేశాల జాతీయ జెండాల ఆవిష్కరణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ పరిపాలన భవనం ఎదుట వాక్‌విత్ నేషన్స్ పేరుతో 194 దేశాల జాతీయ పతాకాలను ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం సాయంత్రం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రెక్టార్ కేవీ రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి జెండా స్తంభానికి క్యూఆర్ కోడ్‌తో కూడిన డిస్‌ప్లే ఉంటుందని, దీని ద్వారా ఆ దేశ జనాభా, కరెన్సీ, తదితర వివరాలు వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టును పూర్వవిద్యార్థి సుందర్ అసోసియేట్స్ చైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు స్వంత నిధులతో ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. మాజీ వీసీ డాక్టర్ పద్మరాజు, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాళీ బాటిల్.. చేపలు ఫుల్



గోదావరిలో బాటిళ్లు విసిరి చేపలు పడుతున్న యువకులు

యానాం: సాధారణంగా చేపలను వేటాడటానికి వల, గేలం ఉపయోగిస్తారు. ఇది అందరికి తెలిసిన విషయమే. అయితే కొందరు ఖాళీ వాటర్ బాటిల్‌ను ఉపయోగించి వినూత్నంగా చేపల వేట సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. యానాం గౌతమీ గోదావరి తీరం ప్రాంతంలోని కనకాలపేట పుష్కర ఘాట్ వద్ద పలువురు యువకులు చేపలు పట్టేందుకు ఈ టెక్నిక్ ఉపయోగిస్తున్నారు. ముందుగా ఖాళీ వాటర్ బాటిల్ తీసుకుని, దాని అడుగు భాగాన్ని కట్ చేసి తీసేస్తారు. తాడు కట్టేందుకు వీలుగా బాటిల్ మూతకు సమీపంలో రెండు రంధ్రాలు చేస్తున్నారు. బాటిల్‌లో మైదాపిండిని ఎరగా పెట్టి నీటిలోకి వదులుతున్నారు. మేత తినేందుకు చేపలు బాటిల్‌లో దూరగానే తాడుసాయంతో పైకి లాగుతున్నారు.



బాటిల్‌లో చిక్కుకున్న కొయ్యంగ చేప

రబీ పైనే ఆశలు



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బోరు కింద వేసిన వరి ఆకుమడి

- వరి నాట్లు ప్రారంభం
- సాధారణ సాగు 60,042 హెక్టార్లు
- పడిన నాట్ల విస్తీర్ణం 2,224 హెక్టార్లు
- 3,002 హెక్టార్లలో నారుమడులు
- 22,497 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం

దేవరపల్లి: జిల్లాలో ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడుల రాక నష్టపోయిన రైతులు రబీపైనే ఆశలు పెట్టుకుని వరి సాగులో తలమునకలై ఉన్నారు. బోర్లు, కాలువలు, సాగునీటి చెరువుల కింద పోసిన ఆకుమడులు సిద్ధం కావడంతో నాట్లు వేస్తున్నారు. రెండు వారాలుగా వరినాట్లు సాగుతున్నాయి. సార్వాలో వేసిన వరిపంటకు మంచి ధర లభించినప్పటికి దిగుబడులు తగ్గడంతో రైతులకు పంట లాభసాటిగా లేకుండా పోయింది. సార్వాలో నాట్లు వేసిన కొద్దిరోజులకు అధిక వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాలు, కాలువలు, చెరువుల కింద వేసినవి దెబ్బతిన్నాయి. దీంతో చాలామంది రైతులు మళ్లీ నాట్లు వేయవలసి వచ్చింది. అప్పటికే ఎకరాకు సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు కావడంతో రైతులు నష్టపోయారు. రెండవసారి వేసిన నాట్లు ఆలస్యం కావడంతో దిగుబడులు ఆశించినంతగా రాలేదు. ఎకరాకు 30 నుంచి 32 బస్తాల దిగుబడి వచ్చినప్పటికీ పెట్టుబడులు ఎక్కువ కావడం, దిగుబడులు తగ్గడంతో నికర ఆదాయం తగ్గింది. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో కొవ్వాడ కాలువ ముంపునకు, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో ఎర్రకాలువ ముంపునకు పంట దెబ్బతింది. దీంతో రబీలో దాళ్వా పంటపై రైతులు ఆశలు పెట్టుకుని సాగు చేస్తున్నారు. దాళ్వాలో ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడి సాధిస్తున్నారు.

ఎరువుల కొరత లేదు



రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. దాళ్వా సీజన్‌లో వరి, ఇతర పంటలకు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ప్రస్తుతం 22,497 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో యూరియా 8,300, కాంప్లెక్స్ ఎరువులు 7,800, సూపర్ 2,100, పొటాష్ 2,100 , డీఏపీ 928 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా ఎక్కువగా కావాలంటే 24 గంటల్లో సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం

అధిక దిగుబడులు వచ్చే వంగడాల సాగు

దాళ్వాలో అధిక దిగుబడులు వస్తున్న వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1121, 1153, 1156 వంగడాలు అధిక దిగుబడులు ఇస్తున్నాయి. వీటిలో ఎంటీయూ 1121 వంగడాన్ని రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ వంగడాల పంట కాల పరిమితి 117 నుంచి 120 రోజులు ఉంటుంది. ఎకరాకు 50 నుంచి 55 బస్తాల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం సొసైటీలు, ప్రయివేటు డీలర్ల ద్వారా విత్తనాలను సరఫరా చేస్తోంది. ఎక్కువగా రైతుల నుంచి రైతులు వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

2,224 హెక్టార్లలో వరినాట్లు

2024-25 సంవత్సరం పంట కాలానికి రబీలో జిల్లాలోని 18 మండలాల్లో సాధారణ వరిసాగు విస్తీర్ణం 60,042 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 2,224 హెక్టార్లలో నాట్లు వేశారు. మెట్ట ప్రాంతంలో బోర్లు, డెల్టా ప్రాంతంలో కాలువల కింద ఆయకట్టు భూముల్లో వరినాట్లు జరుగుతున్నాయి. 3,002 హెక్టార్లలో నారు మడి అవసరం కాగా, 954 హెక్టార్లలో నారుమడులు సిద్ధంగా ఉన్నాయి.

త్వరలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు



షేక్ సలీం బాషా, డీఈవో

అమలాపురం రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, పరిశోధనా సక్తిని వెలికి తీసేందుకు త్వరలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. సాంకేతికత, ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచారం, సేంద్రియ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, నమూనాలు, వ్యర్థాలు, వనరుల నిర్వహణ వంటి వాటిపై ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు. మండల స్థాయి ప్రదర్శన తేదీలను ఈ నెల 29వ తేదీకి ముందుగానే ఎంఈవోలు తెలియజేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యాన్ని 96401 88525 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రొక్కమే దిక్కు!

- రత్నగిరిపై దేవస్థానం కౌంటర్లలో నగదు లావాదేవీలకే అనుమతి
- డిజిటల్ పేమెంట్స్‌కు అవకాశం లేదు
- సత్యదేవుని భక్తులకు తీవ్ర ఇబ్బంది
- ఏటీఎంలో ఎప్పుడు నో క్యాష్



అన్నవరం దేవస్థానం

అన్నవరం: ఇప్పుడు దేశంలో ఏ మూలకెళ్లినా జేబులో కరెన్సీ నోట్లు లేకపోయినా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే వంటి యాప్‌లు ఉండి బ్యాంకు అకౌంట్‌లో నగదు నిల్వ ఉంటే చాలు ఏ వస్తువైనా కొనుగోలు చేయవచ్చు. రూ.పది నుంచి రూ.49 వేల వరకు ఆ యాప్ ద్వారా చెల్లించవచ్చు. ఒక్కోసారి సరిపడినంత నగదు అకౌంట్‌లో లేకపోయినా మరొకరి అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని చెల్లించే సౌలభ్యం కూడా ఉంది. కానీ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మాత్రం భక్తుల ఫోన్‌లో డిజిటల్ పేమెంట్ యాప్‌లు ఉన్నా, వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉన్నా చెల్లింపులకు ఆస్కారం లేదు. కేవలం జేబులో సరిపడనంత నగదు ఉంటే తప్ప ఇక్కడ స్వామి దర్శనం టిక్కెట్టు కాని, వ్రతం టిక్కెట్టు కాని కొనుగోలు చేయలేరు. ఎందుకంటే ఇక్కడ కేవలం నగదుతోనే సత్యదేవుని వ్రతం టిక్కెట్టు, ప్రసాదం ప్యాకెట్ కొనుగోలు చేయాలి. ఒకవేళ నగదు విత్‌డ్రా చేయడానికి ఏటీఎంలు కూడా అందుబాటులో ఉన్నా వాటిలో ఎప్పుడు నో క్యాష్ అనే మెసేజ్ స్క్రీన్‌పై కనిపిస్తుంటుంది. దీంతో తగినంత నగదు తేలేని భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొండదిగువన ఏటీఎంల వద్దకు వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకుని మళ్లీ కొండమీదకు రావాల్సిన పరిస్థితి. కారు ఉన్న వారికి ఫర్వాలేదు. లేనివారు ఆటోలకు చార్జీల కింద రూ.200 చెల్లించాల్సి వస్తోంది. లేకపోతే అక్కడ వ్యాపారాలు చేసుకొనేవారికి ఫోన్ పే ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసి వారి వద్ద నుంచి నగదు తీసుకోవలసిన పరిస్థితి.

రోజూ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం

రత్నగిరికి ప్రతీ రోజు సుమారు 10 వేల నుంచి 50 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. పర్వదినాలలో అయితే ఈ సంఖ్య లక్ష దాటుతుంది. భక్తుల ద్వారా దేవస్థానానికి ఆదాయం కూడా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు, పర్వదినాలలో అయితే రూ. కోటి వరకు కూడా ఉంటుంది. అంతా నగదు వ్యవహారాలే కావడంతో సిబ్బందికి లెక్కింపు కూడా ఇబ్బందిగా మారుతోంది.

తక్కువ నగదుతో రత్నగిరికి వస్తున్న భక్తులు


డిజిటల్ పేమెంట్స్ సర్వసాధారణం అయిన ప్రస్తుత పరిస్థితిలో భక్తులు తక్కువ నగదుతో స్వామివారి ఆలయానికి వస్తున్నారు. ఇక్కడకు వచ్చాక దేవస్థానం నిర్వహించే ప్రతి కౌంటర్‌లో నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో దేవస్థానంలోని ప్రయివేట్ షాపులు, క్యాంటీన్ నిర్వాహకులు, చివరకు చెప్పుల స్టాండ్ల నిర్వాహకులు కూడా డిజిటల్ పేమెంట్స్ అంగీకరిస్తున్నారు. దీంతో భక్తులు వారిని నగదు ఇవ్వండి మీకు ఫోన్ పే ద్వారా పంపిస్తామని బతిమాలుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలా దేవస్థానానికి వచ్చిన భక్తులందరికీ నగదు సర్దుబాటు చేసే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

మూడు ఏటీఎంలున్నా నగదు అంతంత మాత్రమే

దేవస్థానంలో స్టేట్‌బ్యాంక్ ఏటీఎం పశ్చిమ రాజగోపురం వద్ద, యూనియన్ బ్యాంక్ ఏటీఎంలు తూర్పు రాజగోపురం దిగువన పార్కింగ్ స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో, అన్నదాన భవనంపై భాగంలో ఉన్నాయి. వీటిలో కూడా నగదు డిపాజిట్ చేసిన గంటలోనే భక్తులు విత్‌డ్రా చేస్తుండడంతో డబ్బు ఖాళీ అయిపోతోంది. దీంతో భక్తులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఇతర దేవస్థానాల్లో ఇప్పటికే డిజిటల్ పేమెంట్లకు అవకాశం

ఇతర దేవస్థానాలలో ఇప్పటికే డిజిటల్ పేమెంట్స్‌కు అవకాశం కల్పించారు. శ్రీశైలం దేవస్థానంలో 90 శాతం సేవలన్నీ ఆన్‌లైన్ చేశారు. విజయవాడ, ద్వారకాతిరుమల దేవస్థానాల్లో కూడా డిజిటల్ పేమెంట్స్ కోసం ప్రత్యేక మెషీన్లు ఏర్పాటు చేశారని ఆ దేవస్థానాల్లో ఆ సేవలు ఉపయోగించుకున్న వారు తెలిపారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో కూడా డిజిటల్ పేమెంట్స్‌ను అనుమతిస్తున్నారు. కాని ప్రతీ రోజూ వేల సంఖ్యలో భక్తులు వచ్చే అన్నవరం దేవస్థానంలో ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ రాజగోపురం వద్ద, రామాలయం వద్ద గల సన్నిధి బుకింగ్ కౌంటర్‌లో డిజిటల్ పేమెంట్లకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.



ప్రతిపాదన పరిశీలిస్తాం



అన్నవరం దేవస్థానంలో డిజిటల్ పేమెంట్స్ కౌంటర్ల ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తాం. చాలామంది భక్తులు ఈ కౌంటర్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం నా దృష్టికి కూడా వచ్చింది. దీనిపై సంబంధిత విభాగ అధికారులతో చర్చించి భక్తుల ఇబ్బందులు పరిష్కరిస్తాం. ఏటీఎంలలో కూడా ఎక్కువ నగదు డిపాజిట్ చేసేలా ఆయా బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడతాను.

– వి.సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 – 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

కాకినాడలో మహిళ హత్య

- సహజీవనం చేస్తున్న వ్యక్తే హంతకుడు
- ఆర్థిక వివాదాలే కారణం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘాతుకానికి పాల్పడిన వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. జగన్నాథపురానికి చెందిన ఉప్పాడ మణి (31) తన భర్త ఆదినారాయణతో సుమారు 17 ఏళ్ల క్రితం మనస్పర్థల నేపథ్యంలో విడిపోయింది. ఈ దంపతులకు ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. కాగా.. మణికి ఏడేళ్ల క్రితం కర్రి శంకర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేశవారి దొడ్డిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. వీరిద్దరి మధ్య కొన్నాళ్లుగా ఆర్థిక వివాదాలు మొదలయ్యాయి. సెంట్రింగ్ పనిచేసే శంకర్.. మణి కూలి పనులు చేసి సంపాదిస్తున్న డబ్బులు తీసుకునేవాడు. వాటిని తిరిగి ఇవ్వకపోవడంతో వివాదం ముదిరింది. ఈ నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ రాత్రి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది.

పక్కదారి పట్టించే యత్నం

శంకర్ ఈ నెల 23వ తేదీన మణి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. రోజూ మాదిరిగానే తాను ఉదయమే వెళ్లానని, అనంతరం పలుమార్లు ఫోన్ చేసినా మణి తీయలేదని, దీంతో మధ్యాహ్నం ఇంటికి వెళ్లి చూస్తూ మంచంపై విగత జీవిగా పడి ఉందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

పోలీసుల విచారణ

దర్యాప్తులో భాగంగా శంకర్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో మణిని తానే హత్య చేశానని అంగీకరించాడు. డబ్బుల విషయంలో ఈ నెల 22వ తేదీ రాత్రి ఘర్షణ పడ్డామన్నాడు. మణికి హృద్రోగం ఉందని, ఆమెను కోపంలో కొట్టడంతో అపస్మారక స్థితికి చేరి చనిపోయిందని వివరించాడు. దీంతో శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి సోదరుడు ఉప్పాడ ప్రసాద్ ఫిర్యాదుతో కాకినాడ వన్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదు కాగా వన్ టౌన్ సీఐ నాగ దుర్గారావు, దిశ డీఎస్పీ రామచంద్రరావు సంయుక్త ఆధ్వర్యంలో విచారణ జరిగింది.



రాజమహేంద్రవరం కంబాలపేట బైబిల్ మిషన్ చర్చిలో మహిళలు



అమలాపురం సెయింట్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కాకినాడలోని రమణయ్యపేట బెరాకా చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



ఉప్పాడ చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



సఖినేటిపల్లి లూథరన్ దేవాలయంలో భక్తులు

రక్షకుడి రాక.. వెలుగు రేఖ



అమలాపురం మన్నా చర్చిలో ఏసు జననంపై నాటక ప్రదర్శన

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఏసు జననంపై నాటక ప్రదర్శనలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రేమ, త్యాగం, కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసుక్రీస్తు జన్మదినోత్సవం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలతో పాటు క్రైస్తవుల ఇళ్లు ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో మెరిశాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ వేడుకలు కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కూడికలు, గీతాల ఆలాపనతో సందడి నెలకొంది. క్రైస్తవ మందిరాలలో పెద్దలు, పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని అందించారు. క్యాండిల్స్ వెలిగించి భక్తిని చాటుకున్నారు. క్రైస్తవులు ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, రామచంద్రపురం, రాజోలు, పిఠాపురం, సామర్లకోటతో పాటు ఇతర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజమహేంద్రవరం సమీపంలోని లాలాచెరువు హోసన్న మందిరంలో క్రైస్తవుల ప్రార్థనలు

అధిక దిగుబడికి విత్తనమే కీలకం

- నారుమడి దశ చాలా ముఖ్యం
- విత్తన శుద్ధితో ఫలితాలు
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

ఆలమూరు: వ్యవసాయంలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలంటే శ్రేష్టమైన విత్తనాలను ఎంచుకోవాలి. సాగులో నారుమడి దశ చాలా కీలకం. ఆ సమయంలో సరైన విత్తనాలు ఎంచుకుంటే చక్కని ఫలితాలను సాధించే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. పండించే పంటను అనుసరించి సమీప వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాలి. అలాంటి అవకాశం లేకుంటే స్థానిక డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులను సంప్రదించి విత్తనాల కొనుగోలుపై సలహాలు స్వీకరించాలి. ఒక వేళ విత్తనాన్ని తయారు చేసుకున్న రైతులైతే మొలక శాతాన్ని పరిక్షించుకోవాలి. పంటల సాగులో సరైన విత్తనాలను వినియోగించకపోతే మొలక శాతం తక్కువగా ఉండి దిగుబడి తగ్గిపోయే ప్రమాదముంది. ఒక్కోసారి తెగుళ్లు, చీడపీడలు ఆశించి వరి పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపిన విత్తన రకాల వివరాలు ఇలా ఉన్నాయి.

బ్రీడర్

వరి పంటలో అన్ని రకాల విత్తనాలకు మూలంగా బ్రీడర్ సీడ్‌ను పరిగణించవచ్చు. వరి విత్తన పరిశోధనా స్థానాల్లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వీటిని ఉత్పత్తి చేస్తారు. ఈ విత్తనాల్లో జన్యు స్వచ్ఛత వంద శాతం ఉంటుంది. ఈ విత్తనం సంచులకు పసుపు రంగు ట్యాగ్ వేస్తారు.

ఫౌండేషన్

బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ రకం విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఇవి కూడా దాదాపు వంద శాతం జన్యు స్వచ్ఛతను కలిగి ఉంటాయి. ఈ విత్తనం సంచులకు తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది.

సర్టిఫైడ్

వ్యవసాయశాఖ పర్యవేక్షణలో ఫౌండేషన్ విత్తనం నుంచి వరి విత్తనాలను రైతులు తమ పొలాల్లో పండిస్తారు, సీడ్ సర్టిఫికేషన్ ఆధ్వర్యంలో రైతులు పొలాల్లో పండిస్తారు. వీటిని వ్యవసాయశాఖ ప్రయోగశాలల్లో పరీక్షించిన తర్వాత, నిర్దేశించిన ప్రమాణాలు ఉంటేనే వ్యవసాయశాఖ సీడ్ సర్టిఫికేషన్ ధ్రువీకరణ పత్రం అందిస్తుంది. ఈ విత్తనాల సంచులకు నీలిరంగు ట్యాగ్ ఉంటుంది.

మొలక శాతాన్ని పరీక్షించే విధానం

అన్నదాతలు నారుమడులు వేసే ముందు విత్తనాల నాణ్యతను తెలుసుకునేందుకు విధిగా మొలక శాతాన్ని పరీక్షించాలి. సాగు చేసే విత్తనాల్లో కొన్నింటిని నీరు నింపిన గ్లాసులో వేయాలి. అందులో సుమారు 80 శాతం మేర మొలకలు వస్తేనే నారుమడికి వినియోగించాలి. విత్తన శుద్ధి కోసం కిలో విత్తనాలకు విధిగా మూడు గ్రాముల కార్బెండిజమ్ కలిపి, రెండు రోజులు సంచిలో నిల్వ ఉంచాలి. అనంతరం వదులు సంచుల్లోనే విత్తన శుద్ధి చేసిన విత్తనాలను నానబెట్టాలి. ఒక రోజు నీటిలో ఉంచిన అనంతరం బయటకు తీసి, మళ్లీ గాలి తగలని ప్రదేశంలో మరో రోజు ఉంచాలి. వరి పొలాల్లో ఒక సెంటు భూమిలో ఐదు కిలోల చొప్పున విత్తనాలను సమానంగా చల్లుకోవాలి. నత్రజని చల్లిన తర్వాత 12 నుంచి 16 రోజుల మధ్యలో పోటాషియం, భాస్వరం ఎరువులను చల్లుకోవాలి. నారుమడి వేసిన 25 రోజుల తరువాత వరినాట్లు వేసుకోవాలి.

లోపాలుంటే ఫిర్యాదు చేయండి

నారుమడి వేసిన పది రోజుల వ్యవధిలో విత్తనాల నుంచి మొలకలు రాకుంటే సత్వరమే వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేయాలి. డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల ద్వారా జిల్లా విత్తన కమిటీకి ఆ ఫిర్యాదు అందేలా చర్యలు తీసుకోవాలి. ఒక వేళ విత్తనాల్లో లోపాలుండి నారుమడి దెబ్బతింటే సంబంధిత అధీకృత డీలర్, కంపెనీ నుంచి నష్టపరిహారం పొందే వీలుంటుంది.

పాడి-పంట



పెనికేరులో పొలాన్ని దమ్ము చేస్తున్న ట్రాక్టర్



పినపళ్లలో నారుమడికి విత్తనాలు చల్లుతున్న రైతు



వరి విత్తనాల బస్తాలు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వరి విత్తనాలను కొనుగోలు చేసేముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తన అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి. ఆ సమయంలో విత్తన సంచుల బరువును సరిచూసుకోవాలి.
- సంచులపై విత్తన రకం, ల్యాబ్ సంఖ్య, గడువు తేదీతో కూడిన వ్యవసాయశాఖ ధ్రువీకరణ పత్రం ఉందో, లేదో పరిశీలించాలి.
- విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత సంబంధిత డీలర్ నుంచి బిల్లు (రశీదు) తీసుకోవాలి. ఒక వేళ పంట దెబ్బతింటే ఈ బిల్లు ద్వారా పరిహారం పొందే వీలుంటుంది.
- హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తన రకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యత వివరాలు సంచి లేబుల్ మీద ఉన్నాయో, లేదో గుర్తించాలి.
- విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత ఇంటికి వెళ్లి మొలక శాతాన్ని పరీక్షించాలి. అది సంతృప్తికరంగా ఉంటేనే పొలంలో విత్తుకోవాలి.
- విత్తనాల్లో నాణ్యత లోపించి మొలకెత్తకుండా ఉంటే సంబంధిత అధీకృత డీలరు వద్దకు వెళ్లి విత్తనాల మార్పిడి చేసుకోవాలి. డీలర్ స్పందించకపోతే స్థానిక వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.
- విత్తనాల రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.
- సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకెట్లు, మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదు.
- విత్తన మొలక శాతంలో పురోగతి లేకపోతే సత్వరమే వ్యవసాయశాఖకు పరిస్థితిని వివరించాలి. వ్యవసాయ క్షేత్రం వద్దకు తీసుకు వెళ్లి మొలక శాతం దెబ్బతిన్న విధానాన్ని తెలియజేయాలి.

వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షితం

- ఒడ్డుకు తీసుకువచ్చిన కోస్ట్‌గార్డులు
- రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం

కాకినాడ క్రైం: వేటకు వెళ్లి వాతావరణ ప్రతికూలతల వల్ల సముద్ర జలాల్లో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కోస్ట్‌గార్డు సిబ్బంది రక్షించారు. ఏపీ మేరిటైమ్ బోర్డ్, ఓఎన్‌జీసీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 23వ తేదీన కాకినాడ పర్లోవపేటకు చెందిన నలుగురు మత్స్యకారులు వాడమోదుల ధర్మరాజు, వాడమోదుల పెంటయ్య, మల్లాడి నాని, మల్లాడి సతీష్ కాకినాడ హార్బర్ నుంచి భైరవపాలెం మీదుగా చేపల వేటకు బయలుదేరారు. సముద్రంలో 25 నాటికల్ మైళ్ల దూరంలో వేట సాగిస్తుండగా పెనుగాలులతో సముద్రం కల్లోలంగా మారింది. అలలు విపరీతంగా ఎగసి పడ్డాయి. దీంతో మత్స్యకారులు తమ బోటును సమీపంలో ఉన్న రిలయన్స్ రిగ్‌కు తాళ్లతో బలంగా కట్టారు. అలల ఉధృతికి బోటు తిరగబడకుండా, మునిగిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నెల 24వ తేదీన మత్స్యశాఖ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి సహాయం కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇండియన్ కోస్ట్‌గార్డు సహాయం కోరింది. కోస్ట్‌గార్డు ఓఎన్‌జీసీ, ఏపీఎంటీ బోర్డ్ సమన్వయంతో మత్స్యకారులను రక్షించేందుకు ఆపరేషన్ మొదలు పెట్టింది. బుధవారం ఉదయం మొదలైన రెస్క్యూ సాయంత్రం వరకు కొనసాగింది. ఎట్టకేలకు నలుగురు మత్స్యకారులను కోస్ట్‌గార్డు బృందం తీరానికి చేర్చి ప్రాణాలు కాపాడింది. కాకినాడలోని కోస్ట్‌గార్డు స్టేషన్‌లో వారికి ప్రాథమిక చికిత్స అందించారు. కలెక్టర్ షణ్మోహన్ సహా కోస్ట్‌గార్డు బృందానికి బాధితుల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



కాకినాడ కోస్ట్‌గార్డు స్టేషన్‌కు సురక్షితంగా చేరుకున్న మత్స్యకారులు, చిత్రంలో అధికారులు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అమలాపురం టౌన్: కృష్ణా జిల్లా కృష్ణలంకలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచి, పతకాలు సాధించారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులైన బి.సింధు 52 కేజీల విభాగంలో తృతీయ, జె.జితేంద్ర దొర 59 కేజీల విభాగంలో ప్రథమ, వి.సోమశేఖర్ 66 కేజీల విభాగంలో ద్వితీయ, కె.నాని 74 కేజీల విభాగంలో ద్వితీయ స్థానాలలో నిలిచారు. ఈ సందర్భంగా కోచ్ ఎం.వీరేంద్ర, టీమ్ మేనేజర్ పీఈటీ బి.బుజ్జి మాట్లాడుతూ ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి టీం చాంపియన్ షిప్ విన్నర్లుగా కూడా నిలిచారన్నారు. ఈ మేరకు బుధవారం జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కోచ్ ఎంవీ సముద్రం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న జిమ్ ప్రతినిధులు

కబడ్డీ మ్యాచ్‌లకు అంపైర్‌గా మురళీ కుమార్

సామర్లకోట: ఆస్ట్రేలియాలో ఈ నెల 28 నుంచి జరగనున్న ప్రో కబడ్డీ పోటీలకు బోగిళ్ల మురళీ కుమార్ అంపైర్‌గా ఎంపికయ్యారు. సామర్లకోటకు చెందిన ఆయన ఇండియాలో జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌లకు వరసగా పదిసార్లు అంపైర్‌గా వ్యవహరించారు. ప్రో కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు ముగియడం, 26 నుంచి సెమీఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభం కావడంతో బుధవారం పూణే నుంచి ఆస్ట్రేలియా బయలు దేరారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో డిసెంబర్ 28 నుంచి ఇండియా, ఆస్ట్రేలియా లెజెండర్స్ మధ్య కబడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా. మురళీకుమార్ ఆస్ట్రేలియాలో కబడ్డీ మ్యాచ్‌లకు అంపైర్‌గా వెళ్లడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసు, కోశాధికారి నిమ్మకాయల కిరణ్, ఉపాధ్యక్షుడు తాళ్లూరి వైకుంఠం, సభ్యులు, జాతీయ కోచ్ పోతుల సాయి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. మురళీకుమార్ పీఈటీగా సామర్లకోటలో పనిచేసిన సమయంలో ఎస్‌బీఏస్‌ఆర్ క్లబ్‌ను ఏర్పాటు చేసి కబడ్డీ శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం జగ్గంపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.



ప్రోకబడ్డీలో అంపైర్‌గా వ్యవహరించిన మురళీకుమార్

జూనియర్ బాలుర కబడ్డీ విజేతగా శ్రీకాకుళం

రావులపాలెం: ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, సీఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో రావులపాలెంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్ బుధవారంతో ముగిసింది. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 26 జట్లు తలపడ్డాయి. చివరి రోజు జరిగిన ఫైనల్స్‌లో బాలుర విభాగంలో శ్రీకాకుళం విజేతగా నిలిచింది. తుది పోరులో విజయనగరంపై ఆ జట్టు విజయం సాధించింది. తృతీయ స్థానంలో కృష్ణా, గుంటూరు జిల్లా జట్లు సంయుక్తంగా నిలిచాయి. విజేతలకు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి వై.శ్రీకాంత్, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్ రెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర రాఘవరెడ్డి, డైరెక్టర్లు చిర్ల కనికిరెడ్డి, మల్లిడి ఆంజనేయ రెడ్డి, కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, చల్లగళ్ల గోపాలకృష్ణ, దండు సూరిబాబురాజు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కబడ్డీ అసోసియేషన్, సీఆర్‌సీ సభ్యులు

గోదావరి మధ్యలో వంతెనపై నిలిచిన రైలు

రాజమహేంద్రవరం సిటీ: హటియా నుంచి యశ్వంత్‌పూర్ (12835) వెళ్లే ఎక్స్‌ప్రెస్ బుధవారం గోదావరి మధ్యలో రోడ్ కమ్ రైల్వే వంతెనపై నిలిచిపోయింది. రైల్లో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు చైన్ లాగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నది మధ్యలో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనతో కేకలు వేశారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు అప్రమత్తమై లోకో పైలట్‌తో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి బయలుదేరిన తర్వాత రైలు నిలిచిపోయింది. అనంతరం లోకో పైలట్‌కు వచ్చిన ఆదేశాల మేరకు రైలును కొవ్వూరు వైపు తీసుకువెళ్లిపోయారు. ఈ విషయంపై రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్యను వివరణ కోరగా రైలులో ప్రయాణిస్తున్న కొందరు చైన్ లాగడంతో రైలు నిలిచిపోయిందన్నారు. సాంకేతిక పరమైన ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. ఆ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



గోదావరి బ్రిడ్జిపై నిలిచిన రైలు

కారు అదుపు తప్పి యువకుడి మృతి

కొత్తపేట: మండల పరిధిలోని మోడేకుర్రు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్సై కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురానికి చెందిన బీర అర్జున్ (20), గుబ్బల విజయ గోపాలకృష్ణ బుధవారం తెల్లవారుజామున కారులో అమలాపురం నుంచి రావులపాలెం వెళుతున్నారు. మోడేకుర్రు వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బీర అర్జున్ అక్కడికక్కడే మృతి చెందగా, విజయగోపాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే ఏఎస్సై కృష్ణారావు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అర్జున్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.